క్లుప్తంగా

వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న మహిపాల్, కార్మికులు

జహీరాబాద్ టౌన్: రెండు నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు బుధవారం కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ రెండు నెలల నుంచి జీతాలు లేక కార్మికులు అవస్థలు పడుతున్నారని, దసరా పండగ పూట వేతనాలు నిలుపుదల చేయడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే జీతాలు చెల్లించకుంటే కార్మికులు పారిశుద్ధ్య పనులు బంద్ చేస్తారని హెచ్చరించారు. కాగా, రేపటిలోగా కార్మికుల వేతనాలు ఇస్తామని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు మోహన్, దత్తు, గౌస్ ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న బర్తిష్‌కుమార్‌జైన్

జహీరాబాద్: జహీరాబాద్ రైల్వే స్టేషన్‌ను సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ బర్తిష్ కుమార్ జైన్ బుధవారం సందర్శించి, అభివృద్ధి పనులను పరిశీలించారు. రైల్వేస్టేషన్‌లో రూ.25 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేపట్టారు. పనులు నత్తనడకన సాగుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పనుల్లో వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పలువురు బీజేపీ నాయకులు పెండింగ్ సమస్యలపై వినతిపత్రం ఇచ్చారు. బీదర్ నుంచి లింగంపల్లి వరకు డెమో రైళ్లను నడిపించాలని, తిరుపతి రైలుకు స్టాప్ ఇవ్వాలని కోరారు. ఆయన వెంట సీనియర్ డీఓఎం శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ డీఎస్ఓ సురేష్ ఉన్నారు.

ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయండి



సమావేశంలో పాల్గొన్న ఉద్యోగులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఆర్టిజన్ కార్మికులను ప్రభుత్వం వెంటనే కన్వెన్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ జిల్లా కార్యదర్శి సింగిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలోని అంబేడ్కర్ భవన్‌లో టీవీఏసీ జేఏసీ జనరల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే ఆర్టిజన్ కార్మికులందరిని కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఆర్టిజన్లను మోసం చేసిందని, పలుమార్లు అసెంబ్లీలో చెప్పిన మాజీ సీఎం కేసీఆర్ మాట తప్పి అటు కాంట్రాక్టు, ఇటు పర్మినెంట్ కా కుండా చేశారని విమర్శించారు. అనంతరం ఆర్టిజన్ కార్మికుల సంగారెడ్డి జిల్లా చైర్మన్‌గా రాములు నాయక్, కన్వీనర్‌గా ప్రశాంత్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రం ప్రారంభం



ఉత్పత్తుల కేంద్రం ప్రారంభించిన మల్లయ్య

జోగిపేట(అందోల్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇందిరా మహిళా శక్తి ' పథకంలో భాగంగా బుధవారం అందోల్, జోగిపేట పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకపు కేంద్రం కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ మల్లయ్య ప్రారంభించారు. లక్ష్మీనరసింహ మహిళా సంఘాల సభ్యులు దీపిక, వనజలు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలు, వరి ఉత్పత్తులు, డైరీ ఉత్పత్తులు, గానుగ నూనెలు, పాల ఉత్పత్తులు ఇలా పలు రకాల చిరుధాన్యాలకు సంబంధించిన అమ్మకం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు పూర్తి ఆరోగ్యకరంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన పంటలనే వాడాలని చైర్మన్ జి.మల్లయ్య సూచించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ తిరుపతి, వైస్ చైర్మన్ ప్రవీణ్ , కౌన్సిలర్లు శంకర్, సురేందర్ గౌడ్, చిట్టిబాబు, సురేష్, నాగరాజు, మెప్మా టీఎంసీ భిక్షపతిగౌడ్, ఆర్పీలు పాల్గొన్నారు.

ఖేడ్ పీఆర్‌ఏఈగా విద్యాసాగర్‌రెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మండల పంచాయతీరాజ్ ఏఈగా విద్యాసాగర్‌రెడ్డి నియమితులయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా కొల్లాపూర్ నుంచి బదిలీపై ఖేడ్‌కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన రాకేశ్ బీబీనగర్‌కు బదిలీ అయ్యారు. మనూరు, నాగల్‌గిద్ద మండలాలకు నూతనంగా ఉద్యోగం పొందిన రజనీకాంత్ బాధ్యతలు స్వీకరించారు.



మునిపల్లి(అందోల్): బుదేరాలో..



రాయికోడ్‌సరస్వతీ దేవి రూపంలో..



పటాన్‌చెరు టౌన్‌లో..



శ్రీరామలింగేశ్వర దేవస్థానంలో..

సరస్వతీ నమస్తుభ్యం

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. బుధవారం దుర్గామాత అమ్మవారు సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన, అభిషేకాలు, హోమాలు నిర్వహించి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. పలు మండపాల వద్ద భక్తులు అన్నదానం చేశారు.



నారాయణఖేడ్: అమ్మవారి దర్శించుకుంటున్న భక్తులు



జిన్నారం (పటాన్‌చెరు)లో..



కల్హేర్: బల్కంచెల్క తండాలో...



నారాయణఖేడ్‌లో..



సంగారెడ్డి టౌన్‌లో..

పండుగ వేళ 'పానీ' పాట్లు

నెల రోజులుగా 75 గ్రామాలకు నిలిచిన నీటి సరఫరా

- తాగునీటి కోసం అవస్థలు పడుతున్న ప్రజలు



చీకుర్తిలో ట్యాంకు వద్ద నీటిని పట్టుకుంటున్న మహిళలు

న్యాల్‌కల్(జహీరాబాద్): అన్ని పండుగల కంటే దసరా పండుగకు నీటి అవసరం ఎక్కువగా ఉంటుంది. తొమ్మిది రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలు నియమనిష్టలతో నిర్వహిస్తారు. ఇళ్లను శుభ్రం చేసే దగ్గర నుంచి మిగతా అన్నీ పనులకు నీటి అవసరం ఉంటుంది. న్యాల్‌కల్ మండలంతో పాటు సమీపంలో ఉన్న ఝరాసంగం మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాలకు మిషన్ భగీరథ పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. సుమారు నెల రోజుల నుంచి నీటి సరఫరా నిలిచిపోయి అవస్థలు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాల్‌కల్ మండల పరిధిలోని 39 గ్రామాలతో పాటు తండాలు, ఝరాసంగం మండలంలోని 36గ్రామాలు, తండాలకు నీటి సరఫరాను అందించేందుకు చాల్కి వద్ద పిల్టర్ బెడ్‌ను ఏర్పాటు చేశారు. నిత్యం ఇక్కడి నుంచి గ్రామాలకు నీటి సరఫరా చేస్తున్నారు. తాత్కాలిక పద్ధతిన పని చేసే కార్మికులకు సుమారు 6, 7నెలలుగా జీతాలు రావడం లేదు. వచ్చే కొద్ది జీతాలు కూడా కాంట్రాక్టర్ సమయానికి ఇవ్వకపోవడంతో వారు ఆందోళన బాట పట్టారు. దీంతో ఆయా గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో బోరు బావుల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నా ఆ నీరు సరిపోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దసరా పండుగ వేళ నీటి అవసరం ఎంతో ఉంటుందని ఇలాంటి సమయంలో నీటి సరఫరా నిలిచిపోవడం ఇబ్బందిగా ఉందని ప్రజలు వాపోతున్నారు. వెంటనే తాగు నీటి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులకు పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలుగ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నీటి సరఫరాకు చర్యలు

నీటి సరఫరాను రెండు రోజుల్లో పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నీటి సరఫరాకు బిల్లులు రాకపోవడం వల్ల తాత్కాలిక సిబ్బంది ఆందోళన చేస్తున్నారు.

– అంగద్ కుమార్,
మిషన్ భగీరథ ఏఈ జహీరాబాద్

అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ



ఎంపీ సురేష్ షెట్కార్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు

నారాయణఖేడ్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ బుధవారం మహారాష్ట్రంలోని ఉస్మానాబాద్ జిల్లాలోని తుల్జాపూర్ పుణ్యక్షేత్రానికి వెళ్లారు. అక్కడ ఆలయ అర్చకులు పూర్ణాహుతితో స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ తుల్జాభవానీమాతను దర్శించుకున్నారు. జహీరాబాద్ పార్లమెంటు పరిధిలోని ప్రజలు సుఖసంతోషాలతో ఉండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట జిల్లా దిశ కమిటీ సభ్యులు ప్రకాష్ రాథోడ్, న్యాల్‌కల్ మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయశంకర్ ఉన్నారు.

మేలు రకంతో అధిక దిగుబడి

శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్



చెరకు పంటను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

జహీరాబాద్ టౌన్: మేలు రకం చెరకుతో అధిక దిగుబడులు పొందవచ్చని బసంత్‌పూర్ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. రాయికోడ్ గోదావరి గంగా ఆగ్రోప్రొడక్ట్స్ చక్కెర కర్మాగారం యాజమాన్యం ఆధ్వర్యంలో మద్రి గ్రామంలో బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. కర్మాగార యాజమాన్యం సరఫరా చేసిన 18121, పీడీఎస్ 15012 రకం చెరకు తోటలను రైతులతో కలిసి శాస్త్రవేత్త విజయ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలిక వాణిజ్య పంటల్లో చెరకు ప్రధానమైందని, ఈ ప్రాంత నేలలు చెరకు సాగుకు అనుకూలమని చెప్పారు. 18121, పీడీఎస్ 15012 రకాలు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి చేశారని, పంట దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. రైతులకు పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో చక్కెర కర్మాగారం జీఎం, రవీందర్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ కుపేంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింలు రైతులు బాలకృష్ణలు పాల్గొన్నారు.

ప్రధాన పోషకాల పిచికారీ తప్పనిసరి

మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ నూతన్‌కుమార్



పత్తి పంటను పరిశీలిస్తున్న నూతన్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): పత్తి పంట కాయలు ఎదుగుతున్న దశలో నీటిలో కరిగే ప్రధాన పోషకాలు, సూక్ష్మపోషకాలు వారానికోసారి తప్పనిసరిగా పిచికారీ చేయాలని ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని జమ్గి(బీ) గ్రామ శివారులోని పత్తి పంటలను ఆయన పరిశీలించారు. పత్తికాయలు ఎరుపు రంగులో మారి ఎండిపోతున్నట్లు గమనించి, రైతులకు సూచనలు చేశారు. రైతులు క్రిమిసంహారక రసాయనాలు పిచికారీ చేస్తూ నష్టాల పాలవుతున్నట్లు చెప్పారు. సకాలంలో వ్యవసాయాధికారుల సూచనల మేరకు ప్రధాన పోషకాలతో పాటు ఫార్ములా 4, ఫార్ములా 6 పిచికారీ చేయాలన్నారు. సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వివరించారు. దుక్కి దున్నిన పంట పొలాల్లో మొక్కజొన్న, శనగ, జొన్న తదితర పంటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ భార్గవ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



మండలంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం బ్యాతోల్, చిమ్నాపూర్, కాశీపూర్, చేర్యాల, మక్తఅల్లూరు, కవలంపేట్, కంది తదితర గ్రామాల్లో బతుకమ్మ సంబరాలు జరిగాయి. కందిలో తీరొక్క పూలతో అలంకరించిన బతుకమ్మలను పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి, పాండురంగ స్వామి ఆలయ కూడలి వద్ద ఉంచి మహిళలు ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. -కంది(సంగారెడ్డి)

ఆలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్‌చెరు: ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

పటాన్‌చెరు: దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలో జేపీ కాలనీలోని మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయం చతుర్ధ వార్షికోత్సవ కల్యాణం మహోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, వెంకటేశ్, ఆలయ కమిటీ ప్రతినిధులు శ్రీధర్‌చారి, చంద్రశేఖర్, వడ్ల కాలప్ప, దయానంద్ చారి పాల్గొన్నారు.

అతిపెద్ద పండుగ బతుకమ్మ

జిన్నారం (పటాచెరు): రాష్ట్రంలోనే అతిపెద్ద పండుగ బతుకమ్మ అని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని మూడో వార్డులో రూ. 77 లక్షలతో నూతనంగా నిర్మించిన బతుకమ్మ ఘాట్ హైమాస్ట్ లైట్లను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రోజా, మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ కుమార్రెడ్డి కమిషనర్ మంగతాయారు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా అభివృద్ధి

పటాన్‌చెరు: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని ఎస్సీ స్మశాన వాటిక, మున్నూరు కాపు ఫంక్షన్ హాల్, అంబేడ్కర్ కాలనీ, గౌతమ్‌నగర్ కాలనీల్లో నాలుగు కోట్ల 77 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

బతుకమ్మ చీరల పంపిణీ

కొండాపూర్ (మేజర్ న్యూస్): మండల పరిధిలోని చెర్ల గోపులారంలో బుధవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పడమటి అనంత్‌రెడ్డి బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గత 9 సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం బతుకమ్మ పండుగకు చీరలు పంపిణీ చేసిందన్నారు.



చీరలు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నేత అనంత్‌రెడ్డి

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

జిల్లా ఉద్యానవన అధికారి సోమేశ్వర్‌రావు



మాట్లాడుతున్న సోమేశ్వర్‌రావు

జహీరాబాద్: ఆయిల్‌పామ్ పంటను సాగు చేసుకోవడం రైతులకు అన్ని విధాలుగా లాభదాయకంగా ఉంటుందని జిల్లా ఉద్యానవన అధికారి సోమేశ్వరరావు అన్నారు. బుధవారం కోహీర్ మండలం బిలాల్‌పూర్‌లో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట సులువుగా పండుతుందని, మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందని వివరించారు. మార్కెటింగ్ ఇబ్బందులు ఉండవని, మొక్కలను సరఫరా చేసిన వారే పంటను సైతం కొనుగోలు చేస్తారని తెలిపారు. పంటను వేసుకున్నాక నాలుగు సంవత్సరాల వరకు అంతర పంటలను వేసుకోవచ్చని వివరించారు. ఒకసారి ఆయిల్‌పామ్ మొక్కలు నాటితే 30 సంవత్సరాల వరకు ప్రతి సంవత్సరం జనవరి నుంచి జూలై వరకు పంట దిగుబడులు వస్తూనే ఉంటాయన్నారు. దిగుబడులు ఎకరానికి 10 నుంచి 15 టన్నుల వరకు వస్తుందని చెప్పారు. టన్నుకు రూ.10వేల నుంచి రూ.24వేల వరకు మార్కెట్లో ధర లభిస్తుందన్నారు. పెద్ద రైతులు ఇతర పంటలకు బదులు ఆయిల్ పామ్‌ను సాగు చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. సమావేశంలో ఏడీఏ భిక్షపతి, మండల స్పెషలాఫీసర్ బాలక్రిష్ణ, ఏఓ నవీన్‌కుమార్, హెచ్ఓ సునీత, గోద్రెజ్ ఆగ్రోవెట్ డీజీఎం స్వీటీ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మంత్రికి సన్మానం

మునిపల్లి(అందోల్): ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మను తాటిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు శాలువా కప్పి సన్మానించారు. బుధవారం రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారానికి వెళ్తున్న మంత్రిని సన్మానించినట్లు మధు, ఉన్నారు.

◆ రికార్డుల పరిశీలన

మునిపల్లి(అందోల్): మండలంలోని కంకోల్ అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం ఎంపీడీఓ హరినందన్‌రావు రికార్డులను పరిశీలించారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. రోజుకు ఎంతమంది రోగులకు మందులు పంపిణీ చేస్తున్నారని డాక్టర్ రాణిని అడిగి తెలుసుకున్నారు.

◆ సీడీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరణ

సంగారెడ్డి రూరల్: సంగారెడ్డి సీడీసీ చైర్మన్‌గా రాంరెడ్డి బుధవారం టీజీఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరుకు రైతుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ డీఎస్సీలో మార్డి గ్రామస్తుల సత్తా!

కల్హేర్(నారాయణఖేడ్): మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన ఆరుగురు డీఎస్సీ ఫలితాల్లో సత్తా చాటి, టీచర్లుగా నియామకమయ్యారు. సురేష్‌గౌడ్, లక్ష్మణ్, అరుణ్‌రెడ్డి, మల్లేశం, కుమ్మరిస్వాతి, సతీష్ కుమార్ టీచర్లుగా విధులు నిర్వహించనున్నారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నారు. టీచర్లుగా ఎంపిక కావడంపై గ్రామస్తులు అభినందించారు.

◆ నూతన టీచర్లకు అభినందనలు

నారాయణఖేడ్: డీఎస్సీ ద్వారా టీచర్లుగా నియమితులైన అభ్యర్థులను ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అభినందించారు. మునుపెన్నడూ లేనివిధంగా ఖేడ్ నియోజకవర్గానికి చెందిన100 మంది యువతీ యువకులు ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలను అందుకోవడానికి ఎంఈఓల తో కలిసి ఖేడ్ నుంచి రెండు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు. హైదరాబాద్‌లో వారిని రిసీవ్ చేసుకున్న ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు. అధికారంలోకి వచ్చిన పదినెలలలోనే పెద్దఎత్తున ఉద్యోగాలు ఇచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

◆ బాధిత కుటుంబానికి అండ

పటాన్‌చెరు: ఫార్మా పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి ఎమ్మెల్యే అండగా నిలిచారు. యాజమాన్యంతో చర్చించి రూ.20 లక్షల నష్టపరిహారం అందజేశారు. వివరాల ప్రకారం .. మెదక్ జిల్లా మగ్దంపూర్ గ్రామానికి చెందిన సుంకరి యాదగిరి, జిన్నారం మండలం కాజిపల్లి పరిధిలోని ఆరోరా లైఫ్ సైన్సెస్ పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడిగా విధుల్లో చేరాడు. ఇటీవల పరిశ్రమలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. యాజమాన్యంతో చర్చించి కార్మికుడికి నష్టపరిహారం అందేలా చేశారు.

◆ సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధి లేదు

జహీరాబాద్: సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని టీఎస్ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం విమర్శించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలో కూరగాయల మార్కెట్‌ను నిర్మించినా అందులో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వీలుగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. దీంతో వ్యాపారులు రోడ్లపైనే కూరగాయలు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ ప్రజలంతా బాగుండాలి

పటాన్‌చెరు టౌన్: దుర్గామాత అనుగ్రహంతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ అన్నారు. మండలంలోని ఇస్నాపూర్ క్రాస్‌రోడ్‌లో సెంట్రింగ్ యూనియన్ వారు ఏర్పాటు చేసిన అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, చిట్కుల్ గ్రామం ఆదర్శనగర్‌లో వెలసిన స్వయంభూ తుల్జభవాని ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని శాస్త్రోక్తంగా జరుగుతున్న హోమంలో పాల్గొన్నారు.

◆ జూకల్‌లో అంధకారం

నారాయణఖేడ్: మండలంలోని జూకల్ గ్రామంలో వీధిదీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. మురుగు కాల్వలు పేరుకుపోయి దుర్గంధం వ్యాపిస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రత్యేక అధికారి, పంచాయతీ కార్యదర్శి గ్రామాన్ని సందర్శించకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. వీధిదీపాలు లేని కారణంగా చీకట్లోనే బతుకమ్మ ఆడాల్సి వస్తుందన్నారు.

◆ హౌస్ అరెస్టు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో బుధవారం బీఆర్‌ఎస్ నాయకులను కొల్లూరు పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు లచిరాంనాయక్, బాలాజీ, మాజీ సర్పంచ్ మల్లేపల్లి సోమిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

◆ మద్యం అమ్మితే రూ. 10వేల జరిమానా

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని బొబ్బిలిగామంలో మద్యం అమ్మకాన్ని నిషేధం విధిస్తూ బుధవారం గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామపెద్దలతో కలిసి ర్యాలీ తీసి, తీర్మానానికి మద్దతుగా సంతకాల సేకరణ చేపట్టారు. గ్రామంలో మద్యం అమ్మితే రూ.10 వేల జరిమానా, మందు కొన్నవారికి రూ.5 వేలు జరిమానా విధిస్తామన్నారు. పట్టించిన వారికి రూ.2 వేల నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు.

◆ సర్వీసు వైరు అపహరణ

నారాయణఖేడ్: గుర్తు తెలియని వ్యక్తులు ఖేడ్ ఆర్టీసీ డిపోకు సంబంధించిన బోరు కనెక్షన్‌కు ఉన్న 50 మీటర్ల సర్వీసు వైరును అపహరించారు. దీంతో డిపోకు నీటి సరఫరా నిలిచిపోయింది.

◆ స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయండి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డి జిల్లా మెడికల్ కళాశాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ఎమ్మారై స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం బుద్దదేవ్ భట్టాచార్య నగర్, బాబానగర్‌లో సీపీఎం రెండవ ఏరియా మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి అనేకమంది వస్తున్నప్పటికీ స్కానింగ్ సెంటర్ లేకపోవడం చాలా దారుణమన్నారు. స్కానింగ్ సెంటర్ లేక ప్రైవేట్ సెంటర్‌ల నిర్వాహకులు వేల రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు.